# ప్రేమే ప్రేమే

## వావిలికొలను రాజ్యలక్ష్మి

''నాన్నా!''

''ఊc..''

''శ్రీహితని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను నాన్నా!''

''ఊc..''


''మీరు ఆ అమ్మాయిని చూడలేదు గానీ చాలా అందంగా ఉంటుంది నాన్నా...''

''ఊc''

''అమ్మకు ఇష్టమే...మీ అభిప్రాయం కూడా చెబితే వాళ్ల పేరంట్స్‌తో మాట్లాడవచ్చు''

''ఊc..''

''నాన్నా!..మిమ్మల్నే! ఏమిటీ 'ఊc..ఊc..'లు. పరధ్యానంగా ఉన్నట్లున్నారు.. నేను ఇందాకట్నుంచీ చెబుతున్నది వింటున్నారా? లేదా? ఈమారు కాస్త గట్టిగా అన్నాడు ధర్మేశ్ తండ్రితో.



అక్కడే కూర్చున్న సునందిని భర్త వంక, కొడుకు వంక మార్చి మార్చి చూస్తోంది.

''ఏమైందమ్మా నాన్నకు? ఏం మాట్లాడరేమిటి?'' చిరాగ్గా అడిగాడు ధర్మేశ్.

''ఏమీ కాలేదు బాబూ! శ్రీహిత సాయంత్రం మనింటికి వచ్చింది మోహిని కోసం. అప్పుడది ఇంట్లోలేదు. అప్పుడే ఆఫీసు నుంచి వచ్చిన మీ నాన్నగారు ఆ అమ్మాయిని చూసి మాట రాక షాక్ తిన్నట్లయ్యారు'' చెప్పింది సునందిని దిగులుతో...

''శ్రీహితను చూసి నాన్నగారు షాకయ్యారా? ఎందుకమ్మా'' గాభారాగా అడిగాడు ధర్మేశ్

''కారణం తెలీదు ధర్మా!..ఆ తర్వాత తేరుకుని ఆమె తల్లిదండ్రుల గురించీ, ఇతర వివరాలు ఏవో అడిగినట్టున్నారు. ఆ అమ్మాయి వెళ్లినప్పటి నుంచి అలా చలనం లేనట్టు కూర్చుండి పోయారు. నేనూ రెండు మూడుసార్లు పిలిచినా...ఇదిగో ఇలాగే పొడిపొడి సమాధానాలు'' చెప్పింది సునందిని.

''నాన్నా! ఎందుకిలా ఉన్నారు?'' అడిగాడు తండ్రి భుజాలు పట్టుకుని ధర్మేశ్

'ఆc..' అంటూ తుళ్లిపడి ఈ లోకంలోకి వచ్చాడు రమణారావు.

''మీ మౌనానికి కారణం ఏమిటి నాన్నా?మీకేమైంది?ఎందుకలా ఉన్నారు''ప్రశ్నలు గుప్పించాడు ధర్మేశ్

''ఏమీ కాలేదురా...ఏమైనా అవుతుందనే భయం ఈ గుండెను పిండేస్తోంది. అందుకే ఈ బాధంతాను'' బరువుగా నిట్టూరుస్తూ జీవంలేని నవ్వు నవ్వాడు రమణారావు.

''శ్రీహితను చూసి షాక్ అయ్యారట..ఎందుకు నాన్నా?'' అడిగిన కొడుకు వంక తేరిపార చూస్తూ సోఫా మీద రిలాక్స్‌డ్‌గా తలవాల్చాడు రమణారావు. ఆ తర్వాత నెమ్మదిగా మాట్లాడసాగాడు.

''మీ చెల్లెలి స్నేహితురాలు శ్రీహితను నువ్వు పెళ్లాడాలనుకునే విషయమంతా మీ అమ్మ నాకు చెప్పింది. నేనూ మనసారా ఇష్టపడ్డాను. పిల్లల ఇష్టాలను కాదని వారి లేత మనసు

లను నొప్పించే సంకుచిత స్వభావం నాకు గానీ, మీ అమ్మకు గానీ లేదని నీకు బాగా తెలుసు కదా ధర్మా? శ్రీహిత చాలా అందంగా ఉంటుందని మీ అమ్మ చెబితే విన్న నేను, ఈ రోజు చూశాను. నిజంగా ఆ అమ్మాయి అందాల బొమ్మే. అలాంటి పిల్లను నువ్వు భార్యగా కోరుకోవడంలో తప్పులేదు. అయితే నేను మాత్రం ఈ సంబంధాన్ని అంగీకరించలేక పోతున్నాను ధర్మా''

''ఏం? ఎందుకు నాన్నా! మీరు మాపెళ్లికి అభ్యంతరం పెట్టరని ఎంతో ఆశతో ఉన్నా...మీరిప్పుడిలా...?'' నిరాశతో గద్గత స్వరంతో అన్నాడు.

''ధర్మా! ఓ మారు పైకి రా''అంటూ సోఫాలో నుంచి లేచి మేడమెట్లవైపు దారితీశాడు రమణారావు. తండ్రిని అనుసరించాడు ధర్మేశ్.

వారితో పాటు మెట్లెక్కేందుకు ప్రయత్నిస్తున్న సునందిని వారిస్తూ చేత్తో సైగచేశాడు భర్త.

***

రమణారావు నేరుగా తన పడకగదిలోకి వెళ్లాడు. బీరువా మీదున్న ఓ పాత సూట్‌కేసు అందుకుని మంచం మీద పెట్టాడు. ప్యాంట్ జేబు నుంచి తీసిన పర్సు నుంచి చిన్న కీ తీసి దానిని తెరిచాడు.

ధర్మేశ్ తండ్రిని గమనిస్తున్నాడు.

సూట్‌కేసులో నుంచి పాత ఫొటో అల్బమ్ తీశాడు రమణారావు. అందులో కొన్ని పెళ్లి ఫొటోలు ఉన్నాయి.

''వీటిని చూడు ధర్మా...'' నిర్లిప్తంగా ఆల్బమ్‌ను కొడుకు చేతికిచ్చాడు.

ధర్మేశ్ గబగబా ఆల్బమ్‌ను తిరగేసి ఆ ఫొటోలను చూసి నిశ్చేష్టుడయ్యాడు. ఆశ్చర్యంతో కళ్లు పత్తికాయలయ్యాయి. ఒక క్షణం తరువాత తేరుకుంటూ...''నాన్నా!నాన్నా! ఈమె శ్రీహిత.. ఇవి ఆమె పెళ్లి ఫొటోలే... వాటిలో పెళ్లికొడుగ్గా మీరున్నారేమిటి?... ఏమిటీ విడ్డూరం..?''

''ఆ ఫొటోల్లోని అమ్మాయ్ శ్రీహిత కాదు ధర్మా! వాళ్లమ్మ....'' అంటూ మంచం మీద కూర్చుని కొడుకుని పక్కకు తీసుకున్నాడు రమణారావు.

''నేనో భార్య చేతిలో వంచితుడను. పాతికేళ్ల క్రితం ఆమెతో నాకు పెళ్లయింది. పెద్దలు కుదిర్చిన సంబంధం. అనుకూలవతి, అందమైన కోడలు దొరికిందని మా అమ్మానాన్నలు ఎంతో సంబరపడ్డారు. ఆనందంగా సాగిపోతున్న మా సంసారంలోకి ఏడాది తిరిగే సరికి ముద్దులొలికే నువ్వు చేరావు. ఆ తర్వాత కొంత కాలానికే ఆమెలో సరికొత్త కోర్కెలు ప్రవేశించాయి. సైకిల్‌పై చీరలు మూటలతో వ్యాపారం చేసుకునే గోపాలస్వామి...అనే వ్యక్తి మా పచ్చని కాపురానికి శనిలా దాపురించాడు. వాడు మీ అమ్మ కంటే చిన్నవాడే. మంచి మాటకారి. వాడు మన ఇంటిని విడిదిగా చేసుకుని చుట్టుపక్కల అమ్మలక్కలతో చీరల బేరాలు చేసేవాడు. అప్పుడు నీకు ఆరు నెలల వయసు. రానురాను మీ అమ్మలో మార్పులు గమనించసాగాను. భర్తగా నన్ను, కుమారుడిగా నిన్ను నిర్లక్ష్యం చేయడం మొదలుపెట్టింది. ఓ రోజు నాకో ఉత్తరం రాసి పెట్టి, నగదు, నగలతో అతడితో వెళ్లిపోయింది.పసి పిల్లవాడన్న కనికరం కూడా కట్టేయలేక పోయింది. ఆ సంఘటనతో తలెత్తుకోలేక అక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ పెట్టించుకున్నాను. నిన్ను నానమ్మ దగ్గర దింపాను. కూతురి తీరును అసహ్యించుకున్న మీ అమ్మమ్మ వాళ్లు 'అది చచ్చిన దానితో సమానమం'టూ నీళ్లొదిలారు'' గుక్క తిప్పుకోకుండా చెబుతున్న ఆయన ఒక నిమిషం ఆగాడు.

ధర్మేశ్ ఆసక్తిగా వింటున్నాడు.

''ఒకవైపు నీ భవిష్యత్...మరోవైపు నా ఒంటరి జీవితం చూసి దిగులుపడ్డ మా అమ్మానాన్న నాకు రెండో పెళ్లి ప్రతిపాదించారు. నేను మొదట ఒప్పుకోలేదు. అయిన వారి ప్రయత్నాలు మానలేదు. సునందిని సంబంధం తెచ్చారు. అయితే ఆమెకు అన్ని విషయాలు చెప్పి, ఆమె మనస్ఫూర్తిగా ఇష్టపడితేనే ఆలోచిస్తానన్నాను. అలాగే జరిగింది. సునందిని పిన్నే అయినా..కన్నతల్లి కంటే ఎక్కువగా నిన్ను సాకింది. మానాన్న పేరు 'ధర్మారావు'ను 'ధర్మేశ్'గా మీ పిన్నే నామకరణం చేసింది. నువ్వు ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉండడానికి మీ పిన్నే కారణం. ఆ తర్వాత చెల్లెలు మోహిని పుట్టింది''

''జీవితంలో చూడకూడదనుకున్న వారే తిరిగి తారసపడడాన్ని భరించలేక పోతున్నాను. అదీ...వావివరుసలకు విఘాతం కలిగించే పరిస్థితుల్లో...'''

''ఈరోజు శ్రీహితను చూడగానే అమెలో అచ్చుగుద్దినట్టున్న మీ అమ్మ పోలికలు గమనించాను. అనుమానం నివృత్తి కోసం వివరాలు అడిగి తెలుసుకున్నాను. వాళ్ల నాన్న గోపాలస్వామికి నగరంలో మూడు పెద్ద వస్త్రాలయాలు ఉన్నాయట. మీరిద్దరి తండ్రులు వేరైనా, ఒకే తల్లి రక్తం పంచుకున్నారు. ప్రేమించినందుకు భార్యను చేసుకుంటావో, వావివరుసలను మన్నించి సోదరిగా స్వీకరిస్తావో...నీ ఇష్టం'' చెప్పడం ముగించాడు రమణారావు.

ధర్మేశ్ గుండెల్లో బడబాగ్ని చెలరేగింది. రెండు చేతులతో కణతలు రుద్దుకుంటూ మంచానికి అడ్డంగా వాలిపోయాడు.

***

రెండు రోజులు పాటు ధర్మేశ్ ఇంటి నుంచి ఎటూ కదలలేదు. శ్రీహిత ఎన్నోసార్లు ఫోన్ చేసింది. ఎస్ఎంఎస్‌లు పంపింది. అయినా ఇటు నుంచి సమాధానం వెళ్లలేదు.

మూడో రోజు రాఖీ పండుగ. తలస్నానం చేసి చెల్లెలితో రాఖీ కట్టించుకుని,'నిజంగా నువ్వో దేవతవమ్మా!' అంటూ తల్లి కాళ్లకి నమస్కరించాడు.

''ఏంరోయ్....అన్నయ్యా! అమ్మను తెగతెగ కాకా పడుతున్నావ్? శ్రీహిత విషయంలో నాన్నకు రికమెండ్ చేస్తుందనా?'' ఉడికించింది మోహిని.

''ఛట్..ఊరుకో..'' అంటున్న అన్న వంక ఓరగా చూసి నవ్వుతూ...'అదిగో...నీ నోరు మూయించేవాళ్లు వస్తున్నారు. అటుచూడు..!'' అంది.

వాకిట్లో కారు దిగి గబగబా ఇంట్లోకి వచ్చిన శ్రీహిత ''ఏంటిది ధర్మా! ఎన్నిసార్లు ఫోన్ చేసినా రిప్లయ్ ఇవ్వవేం?'' నిష్ఠూరంగా అంది.

''ఇవ్వాలనిపించలేదు..?'' సూటిగా ఉంది ధర్మేశ్ సమాధానం.

''ఏం? ఎందుకు..ఏమైంది నీకు...?'' అడిగింది శ్రీహిత.

''ఏమీ కాలేదు. ఏమీ కాకూడదనే ఉద్దేశంతో నేనీ రోజు నీతో రాఖీ కట్టించుకుందామనుకుంటున్నాను. మోహినితో పాటు నీకు కూడా ఇంకో చెల్లెల్లివి అవుతావు'' నవ్వుతూ అంటున్న ధర్మేశ్ మాటలు విన్న అక్కడున్న ముగ్గురు విస్తుబోయారు.

అప్పుడే మెట్లు దిగి కిందికి వస్తున్న రమణారావు కొడుకు తీసుకున్న నిర్ణయం వినగానే, రెండు రోజుల నుంచి ఎడతెగని ఆలోచనలతో కొట్టు మిట్టాడుతున్న ఆయన మనస్సంతా తేలికైంది. ధర్మేశ్ నుంచి ఆశించిన సమాధానమే ఇప్పుడు ఎదురైంది. ఆయన మనసులో చిగురించిన ఆశ ఒక్కసారిగా పూవై వికసించింది.

*

కవిత

## స్కూలుగంట



గంట ఎలా మోగితేనేమి
గంటగంటే
గోడలు కరిగిపోయి
కొన్ని గజాల క్లాస్‌రూం విస్తీర్ణం
విశాల మైదానంగా మారిపోతుంది
బ్లాక్‌బోర్డు
అనంతమైన ఆకాశంగా విస్తరిస్తుంది
వేలాది చందమామలు ఒక్కసారిగా ఉదయించి
సూర్యుడు వెలవెలబోతాడు

గంట శ్రావ్యంగా మోగిందా
నవ్య, భవ్య ప్రకంపనాలతో ధ్వనించిందా
అది అమ్మ పిలుపులా కమ్మగా వుంటుంది
అంతే!
గూళ్లు చీల్చుకుని బయటపడే
రెక్కల పెను సవ్వడులు
ఇందాక క్రమశిక్షణతో కవాతు చేసిన
చిన్నారి సైనికులు
తుపాకి పేలిన చెట్టుమీది పక్షులౌతారు
ఏం పరుగులవి!
రాళ్లు అడ్డొస్తే దూకేస్తారు
రప్పలు ఎదురొస్తే తన్నేస్తారు

పొద్దున వీపులమీద
భూగోళమంత బరువున్న పుస్తకాలు
దూదిపింజల్లా గాలిలో తేలుతుంటాయి
గంట ఎంతసేపు కొట్టారని కాదు
కొట్టిన చేతులకు మరీమరీ సెల్యూట్లు
టీచర్ కంటే ప్యూన్ సోమయ్యే హీరో
సెలవు నోటీసు తెస్తాడేమో అని ఆశ
స్కూలు మొత్తంలో
వారికిష్టమైంది గంటే
ప్రేయర్ గంట కాదు
ఇంటికెళ్లే ప్రేమగంట

**-డాక్టర్ ఎన్. గోపి**